ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు


సోమవారం 24 నవంబరు 2025

పర్యాటకుల సందడి

పిక్నిక్ సీజన్ కావడంతో పర్యాటక ప్రాంతాల్లో కోలాహలం

తుమ్మపాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):

ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. పిక్నిక్ సీజన్ కావడంతో అనకాపల్లి మండలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు బొజ్జన్నకొండ వద్దకు చేరుకున్నారు. కొండపై గల చారిత్రాత్మక శిలా సంపదను తిలకించి ఫొటోలు తీసుకున్నారు. అలాగే దిగువన ఉన్న మైదానంలో ఆటపాటలతో ఆనందంగా గడిపారు. మధ్యాహ్నం అందరూ వన భోజనాలు చేశారు.



రేవుపోలవరం సముద్రతీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

ముత్యాలమ్మపాలెం తీరంలో..

పరవాడ: మండలంలోని ముత్యాలమ్మపాలెం తీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. ప్రతి ఏడాది కార్తీకమాసం ప్రారంభం నుంచి డిసెంబరు నెలాఖరు వరకు జిల్లా నలుమూలల నుంచి పర్యాటకులు తీరానికి వస్తుంటారు. తీరానికి ఆనుకొని ఉన్న చామలకొండ, దిగువన ఉన్న జీడి మామిడితోటలు పిక్నిక్ స్పాట్‌కు గుర్తింపు పొందాయి. గాజువాక, మల్కాపురం, కూర్మన్నపాలెం, అనకాపల్లి, చోడవరం తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ముత్యాలమ్మపాలెం తీరానికి వచ్చి సరదాగా గడిపారు. మధ్యాహ్నం వనభోజనాలు ముగించుకొని తీరంలో సందడి చేశారు.

రేవుపోలవరం తీరంలో...

ఎస్.రాయవరం: మండలంలోని రేవుపోలవరం ... మిగతా 6వ పేజీలో

క్రిటికల్ హెల్త్ కేర్ యూనిట్ ప్రారంభానికి సిద్ధం

ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో భవన నిర్మాణం పూర్తి

- అందుబాటులోకి రానున్న అత్యవసర వైద్య సేవలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

అనకాపల్లిలోని ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో రూ.22 కోట్లతో చేపట్టిన క్రిటికల్ హెల్త్ కేర్ యూనిట్ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 50 పడకల సామర్థ్యంతో నిర్మించిన ఈ భవనం ప్రారంభానికి సిద్ధమైంది. ఇది అందుబాటులోకి వస్తే రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలైన వారు, అత్యవసర వైద్యం అవసరమైన గర్భిణులు, విషమ పరిస్థితిలో ఉన్న రోగులకు సేవలు అందనున్నాయి.



అనకాపల్లిలోని ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో నిర్మించిన క్రిటికల్ హెల్త్ కేర్ యూనిట్

క్లిష్టతర రోగుల వైద్య సేవల విభాగం (క్రిటికల్ హెల్త్ కేర్ సెంటర్) భవన నిర్మాణ పనులను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. అయితే కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయకృష్ణన్ చొరవతో పనులు పునఃప్రారంభమయ్యాయి. మూడంతస్థుల సువిశాలమైన భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో అత్యవసర వార్డు, స్కానింగ్, రక్త పరీక్షల ల్యాబ్, మందులిచ్చే గదులు ఏర్పాటు చేసేవిధంగా నిర్మించారు. మొదటి అంతస్థులో గర్భిణులు ఉండేందుకు వార్డులు ఏర్పాటు చేస్తున్నారు. రెండవ అంతస్థులో డయాలసిస్ సెంటర్‌తో పాటు ప్రమాదాల్లో తీవ్రమైన గాయాలపాలైన వారికి చికిత్సలు అందించేందుకు వీలుగా గదులను నిర్మించారు. మూడవ అంతస్థులో ఆధునిక వసతి సౌకర్యాలతో శస్త్ర చికిత్స గదులు నిర్మించారు. ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రికి అనుసంధానంగా పనిచేయనున్న క్రిటికల్ కేర్ సెంటర్‌లో వైద్య సేవలు అందించేందుకు ... మిగతా 6వ పేజీలో

రైతుల్లో గుబులు

కోత దశకు వచ్చిన 80 శాతం వరి పంట

- అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తాయేమోనని ఆందోళన
- ఇప్పటికే 20 శాతం కోతలు పూర్తి
- పొలాల్లోనే కుప్పలు వేసిన వైనం



గొర్లివానిపాలెంలో కుప్పలు వేసిన దృశ్యం

సబ్బవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని వరి పంటలు దాదాపు కోత దశకు వచ్చాయి. ఈ సమయంలో బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో వచ్చిన మొంథా తుఫాన్ వలన మండల రైతాంగానికి పెద్దగా నష్టం లేకపోయినా టెన్షన్‌కు గురయ్యారు. అయితే ఈసారి ఏం జరుగుతుందోనని గుబులు చెందుతున్నారు. కాగా ఇప్పుడు పెద్దగా ప్రభావం ఉండదన్న సమాచారంతో వంగలి, నాయనమ్మపాలెం, అంతకాపల్లి, గుల్లేపల్లి, గొర్లివానిపాలెం, సబ్బవరం, టెక్కలిపాలెం, మొగలిపురం, మలునాయుడుపాలెం, అసకపల్లి, బాటజంగాలపాలెం, నారపాడు తదితర గ్రామాల్లో సుమారు 20 శాతం మంది రైతులు ఇప్పటికే కోతలు పూర్తి చేశారు. దీంతో ఆదివారం చాలా గ్రామాల్లో రైతులు పొలాల్లో కుప్పలు వేశారు. ఈ ఏడాది సాధారణ వరి సాగు విస్తీర్ణం 1,306 హెక్టార్లు కాగా, వాతావరణం అనుకూలంగా ఉండడంతో 1,338 హెక్టార్లలో వరి నాట్లు వేశారు. ప్రస్తుతం మండలంలో 80 శాతం వరి పంట కోత దశకు వచ్చిందని, మరో పది రోజుల్లో కోతలు మొదలవుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు మండలంలో 20 శాతం వరకు వరి కోతలు పూర్తయ్యాయని తెలిపారు. కోసిన పంటను జాగ్రత్త చేసుకోవాలని వారు సూచిస్తున్నారు.

అంధుల క్రికెట్‌లో మెరిసిన కరుణ

- సత్తా చాటిన సాగర్‌నగర్ అంధ బాలికల పాఠశాల విద్యార్థిని
- నేపాల్‌తో జరిగిన ఫైనల్‌లో 27 బంతుల్లో 42 పరుగుల సాధన
- కరుణకుమారికి మంత్రి డోలా అభినందనలు




ప్రపంచ కప్‌తో కరుణకుమారి

ప్రపంచ తొలి మహిళల అంధుల టి-20 క్రికెట్ కప్‌ను భారత్ సాధించింది. కొలంబోలో ఆదివారం నేపాల్‌తో ఫైనల్ మ్యాచ్ జరిగింది. జట్టు సభ్యురాలు సాగర్‌నగర్ అంధబాలికల ఆశ్రమ పాఠశాల పదో తరగతి చదువుతున్న, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం వంట్లమామిడికి చెందిన విద్యార్థిని పి.కరుణకుమారి అద్భుత ప్రతిభ కనబరిచి కేవలం 27 బంతుల్లో 42 పరుగులు సాధించి విజయంలో కీలకభూమిక పోషించింది. దీంతో ఆమెను మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. ... వివరాలు స్పోర్ట్స్ పేజీలో

పిక్నిక్‌లో విషాదం

కల్యాణపులోవ రిజర్వాయర్‌లో స్నానానికి దిగి యువకుడి గల్లంతు



రిజర్వాయర్‌లో గాలిస్తున్న గజ ఈతగాళ్లు



గుమ్మిడి శ్రీనివాస్ (ఫైల్)

రావికమతం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని కల్యాణపులోవ పోతురాజుబాబు గుడి వద్దకు ఆదివారం సహచర కూలీలతో కలిసి పిక్నిక్‌కు వెళ్లిన ఒక యువకుడు జలాశయంలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్లు గాలించినా ఆచూకీ లభించలేదు. దీనికి సంబంధించి కొత్తకోట ఏఎస్ఐ సన్యాసిరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కొత్తకోట గ్రామం పెద్ద సోషా వీధికి చెందిన గుమ్మడు రామారావు, రుక్మిణి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శ్రీనివాస్(29) మానసిక దివ్యాంగుడు. అతనికి వివాహం కాలేదు. రెండో కుమారుడు మోహన్‌కు ఇటీవలే వివాహమైంది. కాగా తండ్రి రామారావు రెండేళ్ల క్రితం మృతి చెందాడు. తల్లి రుక్మిణి దివ్యాంగురాలు. కాగా శ్రీనివాస్ గ్రామానికి చెందిన గొర్లె సత్తిబాబు ట్రాక్టర్‌పై డైలీ లేబరుగా పనిచేస్తున్నాడు. అతనితో పాటు ఆ ట్రాక్టర్‌పై పనిచేసే కూలీలు అడ్డూరి శ్రీను, ఉగ్గిన సత్తిబాబు, మట్టా రమణ, ట్రాక్టర్ యజమాని గొర్లె సత్తిబాబు ఆదివారం కల్యాణపులోవ పోతురాజుబాబు గుడి వద్దకు పిక్నిక్‌కు వెళ్లారు. ఉదయం నుంచి వీరంతా సరదాగా గడిపారు. మధ్యాహ్నం భోజనాలు చేశారు. ట్రాక్టర్ యజమాని అక్కడే విశ్రాంతి తీసుకోగా, మిగతా నలుగురు సాయంత్రం నాలుగు గంటల సమయంలో రిజర్వాయర్ వద్దకు స్నానం చేయడానికి వెళ్లారు. వారు జలాశయంలో దిగి స్నానం చేస్తుండగా శ్రీనివాస్ గల్లంతయ్యాడు. అతని కోసం గాలించినా ఆచూకీ లభించకపోవడంతో మిగతా ముగ్గురుపైకి వచ్చేసి ఈ విషయాన్ని ట్రాక్టర్ యజమానికి తెలిపారు. ఆయన వెంటనే శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు, కొత్తకోట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్ఐ సన్యాసిరావు సిబ్బందితో వెంటనే అక్కడికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. చాలా సేపు గాలించినా శ్రీనివాస్ ఆచూకీ లభించలేదు. చీకటి పడడంతో సోమవారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు చేపడతామని ఏఎస్ఐ ... మిగతా 6వ పేజీలో

ముగిసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు


ఉమ్మలాడలో గౌరీపరమేశ్వరులను దర్శించుకున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో శ్రీగౌరీ పరమేశ్వరులు ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. కార్తీకమాసం ముగిసిన వెంటనే ఈ ఉత్సవాల నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి ఉమ్మలాడ, వాడ్రాపల్లి, గవర్లఅనకాపల్లి, గంగాదేవిపేట తదితర గ్రామాల్లో గౌరీపరమేశ్వరులు ముగింపు ఉత్సవాలు జరిగాయి. ఉమ్మలాడలో గౌరీపరమేశ్వరులను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దర్శించుకున్నారు. వాడ్రాపల్లి, గవర్లఅనకాపల్లిల్లో ఏర్పాటు చేసిన సింహాద్రి అ ప్పన్న సేవగరిడీలు, కాళీమాత నృత్యాలు, కోలాటాలు, కోబ్రా డ్యాన్స్ అలరించాయి.


జి.అనకాపల్లిలో అలరించిన కాళీమాత నృత్యాలు, కోలాట ప్రదర్శన

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి: ఎస్ఐ


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

ఎలమంచిలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వాహన డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ అన్నారు. ఆదివారం కొక్కిరాపల్లి జాతీయ రహదారి పక్కన వాహన డ్రైవర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపకూడదన్నారు. ప్రతి ఒక్కరూ లైసెన్స్‌లు పొంది ఉండాలన్నారు. కొత్తచట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'చెకుముకి' పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



ప్రశంసా పత్రాలను అందుకుంటున్న భవానీ స్కూల్ విద్యార్థినులు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో స్థానిక భవానీ స్కూల్ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం అనకాపల్లిలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి చెకుముకి విజ్ఞాన పోటీలలో ఈ పాఠశాలలకు చెందిన లోకజ్ఞ, కుందన, సహస్ర ప్రథమ స్థానాలు సాధించారు. ఈ నేపథ్యంలో ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ నేపథ్యంలో చిన్నారులను భవానీ స్కూల్ చైర్మన్ కూండ్రపు మూర్తి ప్రసాద్, ప్రిన్సిపాల్ సూర్య కుమార్‌లు అభినందించారు.

కోలాటం గురువు ఉమా వెంకటేష్‌కు పురస్కారం


వెంకటేష్‌కు మహానంది పురస్కారం అందజేస్తున్న సంస్థ సభ్యులు

మునగపాక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, సాంస్కృతిక సేవా రంగాలకు విశిష్ట సేవలందిస్తున్నందుకు గాను ఉమ్మలాడ గ్రామానికి చెందిన కోలాటం గురువు మొల్లేటి ఉమా వెంకటేష్‌కు తెలుగు, వెలుగు మహానంది జాతీయ పురస్కారం లభించింది. శ్రీమండలి వెంకట కృష్ణారావు శతజయంతి పురస్కరించుకుని అంతర్జాతీయ తెలుగు బాషా సాహితీ, సాం స్కృతిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కోలాటం ఉమా వెంకటేష్‌కు ఈ పురస్కారాన్ని అందించారు.

యువత క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలి

మునగపాక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): యువత విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని టీడీపీ నాయకుడు దొడ్డి శ్రీనివాసరావు సూచించారు. మండలంలో నాగులాపల్లిలో ఆదివారం రాయల్ క్లబ్ బాక్సింగ్ ఇనిస్టిట్యూట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బాక్సింగ్ ఆత్మరక్షణకు ఎంతగానో దోహదం అవుతుందని తెలిపారు. బాలికలు, యువతులకు శిక్షణ ఇచ్చే విధంగా ఆలోచనలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో దొడ్డి వర, గోవింద, రాయల్ క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు పెదరాంభద్రపురంలో 'రైతన్నా మీకోసం'

పాయకరావుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదరాంభద్రపురంలో సోమవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఏఓ ఆదినారాయణ తెలిపారు. వ్యవసాయశాఖతోపాటు అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో పెదరాంభద్రపురం శివారు డెక్కన్ రోడ్డులో మధ్యాహ్నం 2 గంటలకు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమానికి హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులతో ముఖా ముఖీ నిర్వహిస్తారన్నారు. రైతుల అభివృద్ధి, సంక్షేమం, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తామన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి అధిక సంఖ్యలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మంచుకురిసే వేళలో..!



కోటవురట్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాలు గత రెండురోజుల నుంచి దట్టమైన మంచు తెరలతో ఏజెన్సీ ప్రాంతాలకు తలపిస్తున్నాయి. ఆదివారం ఉదయం 9గంటల వరకు మండల కేంద్రంలో సూర్యుడు జాడ కనిపించలేదు. మబ్బులు, పొగమంచుతో కూడిన వాతావారణం ఆహ్లాదకరంగా కనిపించింది.


సత్యసాయిబాబా చిత్రపటానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్


ఎలమంచిలి సత్యసాయి సేవ మందిరంలో భక్తుల పూజలు

ప్రేమతత్వమే సత్యసాయి మార్గం

- శత జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం రూరల్, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపాలెంలో జరిగిన సత్యసాయి వేడుకలలో స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు ఆచరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమతత్వమే మానవత్వమని, సమానత్వమే సాయి తత్వమనే పరమార్థాన్ని బోధించిన సాయిబాబా మార్గంలో అందరూ నడవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అన్నదానం కార్యక్రమం, నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అప్పలనాయుడు, కాండ్రేగుల జోగినాయుడు, మత్సుర్తి శ్రీను, సాయిబాబా భక్తుడు ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు. మడుతూరు శివాలయంలో జరిగిన సాయిబాబా శతజయంతి వేడుకలలో భాగంగా అచ్యుతాపురం సాయి సేవాసమితి ప్రతినిధి పీఎస్‌టీ పట్నాయక్ చేతుల మీదుగా వృద్ధులకు దుప్పట్లు, రగ్గులు, బియ్యం పంపిణీ చేశారు. ముందుగా జయంతి కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మడుతూరు భజన మండలి కన్వీనర్ ప్రసాద్, గ్రామ పెద్దలు శనివాడ జువ్వాలనాయుడు, భక్తులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

ఎలమంచిలి: పట్టణంలోని సత్యసాయి సేవా మందిరంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయిబాబా భక్త కీర్తనలు ఆలపించారు. తహసీల్దార్ వరహాలు కొక్కిరాపల్లి ప్రేమసమాజమందిరంలో అనాథలకు పండ్లు, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మునగపాక: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, తహశీల్దార్ పి.సత్యనారాయణ, రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాలు సిబ్బంది పాల్గొన్నారు. తిమ్మరాజుపేటలో భగవాన్ శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, నగర సంకీర్తనలు, అన్నసమారాధనతో పాటు పేదలకు దుప్పట్లు పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు చేపట్టారు. బాల వికాస్ సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టినట్టు సత్యసాయి భజన మండలి కన్వీనర్ సరిసా శివగణేష్ తెలిపారు.


తిమ్మరాజుపేటలో వృద్ధురాలికి దుప్పటి అందజేసిన సత్యసాయి భక్తులు


మునగపాకలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి, తహశీల్దార్ సత్యనారాయణ

వరాహాల గుంపులు... జనాల బెంబేలు

- ఎలమంచిలిలో పందుల స్వైర విహారం
- పట్టించుకోని ప్రజారోగ్యశాఖ

ఎలమంచిలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కుక్కలు, పందులు స్వైర విహారంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టణంలో ఇటీవల కోతుల మూక దాడులతో జనాలు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల వీధుల్లో పందుల గుంపులుగా సంచరిస్తూ నివాస ప్రాంతాలను దుర్భరంగా మారుస్తున్నాయి. యానాద్రి కాలువను ఆనుకుని శిథిలమైపోయిన ఇళ్ల వద్ద ఆవాస కేంద్రాలుగా చేసుకుంటున్నాయి. దీంతో సమీపంలోని నివాసితులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పందులతో వ్యాధుల బారిన పడతామోనని ఆందోళన చెందుతున్నారు. నివాస ప్రాంతాలు వద్ద పందులు పెంపకం చేయకూడదన్న నిషేధాజ్ఞలు కొందరు పెంపకం దారులు పట్టించుకోవడం లేదు. దీనికి తోడు అధికారులు పట్టించుకోకపోవడంతో పట్టణ వీధుల్లో పందుల సమస్య తీవ్రతరమవుతోంది. పట్టణ ప్రజలకు గ్రామానికి దూరంలో పందుల పెంపకం చేపట్టాలన్న నిబంధనలు మునిసిపాలిటీలో బుట్టదాఖలవుతున్నాయి. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పురవీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న పందుల పెంపకం దారులు నిర్దిష్ట ఆదేశాలిచ్చి పట్టణానికి దూరంగా తరలించేలా మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


కొత్తపేటలో ప్రధాన రోడ్డులో..


గాంధీనగర్ ప్రధాన రోడ్డు పక్కన పందుల గుంపు

ప్రమాద బాధితులకు పరామర్శ


గాయపడిన వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న నేత ప్రగడ నాగేశ్వరరావు

రాంబిల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్థానిక నేవీ కాలనీకి చెందిన గుడాల చంటిబాబు కుటుంబ సభ్యులను ఆదివారం టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరక్టర్ ధూళి రంగనాయకులు తదితరులు పరామర్శించారు. వైద్యసేవలు పొందుతున్న చంటిబాబు కుమారుడు, కోడలు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ ద్వారా ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాంబిల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఎరిపల్లి చిట్టిబాబు, పర్సన్‌లు నానాజీ, రమణ, ఎలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గరికిన గోవింద్, మండల తెలుగుయువత అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్, నేతలు చెల్లూరి నూకన్న పాల్గొన్నారు.

'కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి'


మాట్లాడుతున్న వైసీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా నేత అప్పారావు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన చట్టాలను రద్దు చేయాలని వైసీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చోడిపల్లి అప్పారావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్ కార్మిక చట్టాలను తీసుకుని వచ్చిందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 9 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. వీటిని వ్యతిరేకిస్తూ ఈ నెల 26న జరిగే దేశవ్యాప్త కార్మికుల ఆందోళనకు వైసీపీ ట్రేడ్ యూనియన్ సంపూర్ణ మద్దత్తు నిస్తుందన్నారు.

కుక్కల దాడిలో పాడి ఆవు మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన పాడి ఆవు

మునగపాక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం వీధి కుక్కల దాడిలో పాడి ఆవు మృతి చెందింది. గోవింద అప్పారావుకు చెందిన ఆవుపై కుక్క లు దాడి చేయడంతో మృత్యువాత పడింది. కుక్కల స్వైర విహారంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు

పాయకరావుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో తెల్లవారుజామున నగర సంకీర్తన, సత్యసాయి వ్రతాలు నిర్వహించారు. అనంతరం వికలాంగులకు ఉపకరణాలు, పేదల ఉపాధికి తోపుడు బండి అందించారు. అలాగే, పేదలకు చీరలు దుప్పట్లు, తుని ఏరియా ఆసుపత్రిలో రోగులకు పాలు, రొట్టెలు, స్వామి చిత్రపటాలను అందించారు. అనంతరం సుమారు 500 మందికి మహానారాయణసేవ నిర్వహించారు. సాయంత్రం ఝులా ఉత్సవంతో సత్యసాయిజయంతి వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి భజన మండలి కన్వీనర్ రమేశ్‌బాబుతోపాటు సభ్యులు యజ్ఞవల్క్యశర్మ, రమణరాజు, సూరపురాజు, లక్ష్మీ పతిరాజు, జగన్నాధరాజు, శ్రీనివాసరావు, సాయికుమారి, కమల, రాధ, దివ్య, సరోజ, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు. స్థానిక తహశీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సత్యసాయిబాబా బోధనలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్‌వి మహేశ్వరరావు, ఎంపీడీఓ విజయలక్ష్మితోపాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


తహశీల్దారు కార్యాలయంలో వేడుకలు నిర్వహిస్తున్న అధికారులు


ఎస్.రాయవరంలో సత్యసాయిబాబా చిత్రపటం వద్ద పూజలు

ఎస్.రాయవరంలో..

ఎస్.రాయవరం: మండల పరిషత్ కార్యాలయంతో ఆదివారం సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు తహశీల్దార్ రమేష్‌బాబు, సిబ్బందితో కలిసి సత్యసాయికి నివాళులర్పించారు.

బాధిత కుటుంబాలకు జనసేన బీమా

- ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం
- కార్యకర్తల సంక్షేమమే పార్టీ ధ్యేయం: గెడ్డం బుజ్జి

నక్కపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జనసేనకు పార్టీ కార్యకర్తల సంక్షేమమే పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లక్ష్యమని పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి అన్నారు. సీతంపాలెంకు చెందిన ఎ. సింహాద్రి, రాజయ్యపేటకు చెందిన ఎం.అప్పలరాజు, న్యాయంపూడికి చెందిన సీహెచ్ ఆనందరావు అనే జనసైనికులు మృతి చెందడంతో వారి కుటుంబాలకు పార్టీ అండగా నిలిచింది. ఆదివారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయం వద్ద ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, కురందాసు సింహాచలం, ఆకేటి గోవిందరావు, పిక్కిస్వామి, పిక్కికోదండరావు (బుజ్జి), మురళీకృష్ణ తదితరులు బాధిత కుటుంబాలకు చెక్కులు, బీమా మంజూరు పత్రాలను అందజేశారు.


బాధిత కుటుంబాలకు బీమా మంజూరు పత్రాలను అందజేస్తున్న గెడ్డం బుజ్జి

బాక్సింగ్ పోటీల్లో తేజస్వినికి బంగారు పతకం



నర్సీపట్నం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయనగరం రాజీవ్‌గాంధీ స్టేడియంలో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో నర్సీపట్నానికి చెందిన యర్రా తేజస్విని 80 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించింది. వచ్చే నెలలో పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగే ఆలిండియా యూనివర్సిటీ బాక్సింగ్ టోర్నమెంట్‌లో తేజస్విని పాల్గొంటుంది. ఈ పోటీలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు చీఫ్ జ్యూరీగా వ్యవహించారని కోచ్ అబ్బు తెలిపారు.

బల్క్‌డ్రగ్‌కు భూములు ఇవ్వం


భూములు ఇవ్వమంటున్న దొండవాక రైతులు

నక్కపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కు కోసం అదనంగా తమ గ్రామంలోని భూములను ఇచ్చేదిలేదని దొండవాక గ్రామ రైతులు స్పష్టం చేశారు. ఆదివారం సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో రైతులు మాట్లాడారు. 2013 భూ సేకరణ చట్టాన్ని పూర్తిగా ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని సీపీఎం నేత అప్పలరాజు ఈ సందర్భంగా ఆరోపించారు. భూ యజమానుల ఆమోదం లేకుండా అధికారులు భూముల్లో ఎలా అడుగుపెడతరని ప్రశ్నించారు. బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాన్, కాశీరావు, రమణ, దేముడు, మధు, ముసిలి, నారాయణ, అమ్మోరు పాల్గొన్నారు.

క్రిటికల్ హెల్త్ కేర్ యూనిట్ ప్రారంభానికి సిద్ధం

... 5వ పేజీ తరువాయి

అత్యవసర వైద్య నిపుణుల పోస్టులు భర్తీ చేయనున్నారు.

ప్రారంభానికి ఏర్పాట్లు

రెండు వారాల్లో క్రిటికల్ కేర్ సెంటర్ భవనాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ విభాగాల్లో రూ.12 కోట్లు విలువ చేసే అత్యాధునిక వైద్య సామగ్రిని సమకూర్చనున్నారు. ఇప్పటికే సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు స్కానర్, సీటీసీ, డిజిటల్ ఎక్స్‌రే వంటి అధునాతన పరికరాలు చేరాయి. త్వరలో వివిధ విభాగాల్లో వీటిని అమర్చనున్నారు. క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయని, త్వరలోనే ప్రారంభానికి ప్రభుత్వం తేదీ నిర్ణయిస్తుందని ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు తెలిపారు.

పర్యాటకుల సందడి

... 5వ పేజీ తరువాయి


బొజ్జన్నకొండ వద్ద సందర్శకులు

సముద్రతీరం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆటపాటలతో సరదాగా గడిపారు. మధ్యాహ్నం అక్కడ చుట్టుపక్కల ఉన్న కొబ్బరి, జీడిమామిడి తోటల్లో వనభోజనాలు చేసి అనంతరం తీరంలో స్నానాలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేలా ఎస్ఐ విభీషణరావు ఆధ్వర్యంలో పోలీసులు డ్రోన్‌తో నిఘా పెట్టి పర్యవేక్షించారు. అలాగే మెరైన్ పోలీసులతో కలిసి స్థానిక పోలీసులు గస్తీ నిర్వహించారు.

పిక్నిక్‌లో విషాదం

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. శ్రీనివాస్ తల్లి రుక్మిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

శారదానదిలో ఇంటర్ విద్యార్థి గల్లంతు

అనకాపల్లి టౌన్: శారదానదిలో ఆదివారం సాయంత్రం ఇంటర్ విద్యార్థి గల్లంతైన సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. విశాఖ నగర పరిధిలోని గోపాలపట్నానికి చెందిన ఎనిమిది మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు పిక్నిక్‌కు అనకాపల్లి వచ్చారు. తుమ్మపాల నుంచి వెంకుపాలెం వెళ్లే రోడ్డులోని శారదానది ఒడ్డున వారు బంతి ఆట ఆడుతున్నారు. బంతి నదిలో పడిపోవడంతో దానిని తీయడానికి ఒక విద్యార్థి దిగి కొట్టుకుపోయాడు. అతనిని రక్షించడానికి ప్రయత్నించి మరో విద్యార్థి కొట్టుకుపోతుంటే అక్కడే ఉన్న మత్స్యకారులు కాపాడారు. అయితే బంతి కోసం దిగి కొట్టుకుపోయిన విద్యార్థి ఆచూకీ తెలియలేదు. సోమవారం ఎస్‌టీఆర్ఎఫ్ బృందాలతో గాలిస్తామని సీఐ తెలిపారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

అనకాపల్లి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరమైన లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని దేశవ్యాప్తంగా కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చలు జరపకపోవడం దారుణమన్నారు. సరికదా పార్లమెంట్‌లో ఏకపక్షంగా లేబర్ కోడ్‌లను ప్రకటించి అమలుకు పూనుకుందని ఆరోపించారు. ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, త్యాగాలతో కార్మికుల రక్షణ కోసం సాధించుకున్న 29 చట్టాలకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌లు తిలోదకాలిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు, పనిగంటలు, సామాజిక భద్రత వంటి హక్కులను కాలరాస్తున్నాయన్నారు. బడా కార్పొరేట్‌లకు, పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా కార్మికుల హక్కులను తీవ్రంగా నష్టం కలిగించే నాలుగు లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు చేయాలని కార్మికులకు ఆయన పిలుపునిచ్చారు.

26న సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి

సబ్బవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతకాపల్లి గ్రామంలో ఈ నెల 26న స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి పూజ కోసం ఏర్పాట్లు జరుగుతున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 8.15 గంటలకు ఉత్సవమూర్తిని తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్న సంతర్పణ, సాయంత్రం దీపాలంకరణ సేవ జరుగుతాయన్నారు. అలాగే గొర్లివానిపాలెం ఉమారామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, హోమాలు, అన్నసమారాధన జరుగుతాయని వారు తెలిపారు.

దేమునిగుమ్మం మార్గం.. అసంపూర్ణం!

» మధ్యలోనే నిలిచిపోయిన సీసీ రహదారి » నూకాంబిక ఆలయానికి ఇదే ప్రధాన రోడ్డు » భక్తులు, విద్యార్థులు, ప్రజల అగచాట్లు

అనకాపల్లి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేమునిగుమ్మం రహదారి అసంపూర్తిగా నిలిచిపోయింది. దేమునిగుమ్మ జంక్షన్ నుంచి నూకాంబిక ఆలయానికి వెళ్లే ఈ మార్గాన్ని జీవీఎంసీ అధికారులు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే భక్తులు, ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఈ రోడ్డును పూర్తి చేయకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పాత జగన్నాథ థియేటర్ వెనుకభాగం, రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం సమీపంలో రహదారి పల్లంగా ఉండేది. దీనికితోడు రోడ్డుకు ఇరువైపులా డ్రైన్లు చిన్నవిగా ఉండడంతో వర్షాలు కురిసినప్పుడుగాని, సాధారణ రోజుల్లోగాని డ్రైన్లు నిండిపోతే, ఆ నీరంతా రోడ్డుపైకి వచ్చి ప్రజల రాకపోకలకు ఇబ్బందులుగా మారాయి. పలు సందర్భాల్లో కమిషనర్ ఈ పరిస్థితిని గమనించి అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కూడా పరిస్థితిని గమనించి తక్షణమే పల్లంగా ఉన్న ఇండోర్ స్టేడియం నుంచి పూల్‌బాగ్ జంక్షన్‌కు వెళ్లే మార్గం వరకు రహదారి నిర్మించాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే రూ.26 లక్షలతో రెండు నెలల క్రితం రోడ్డు నిర్మాణ పనులను ఇండోర్ స్టేడియం నుంచి కాంట్రాక్టర్ ప్రారంభించారు. పూల్‌బాగ్ జంక్షన్‌కు వెళ్లే రోడ్డు సమీపానికి వచ్చేసరికి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. రూ.26 లక్షలు అక్కడి వరకే వచ్చాయని, అందువల్లే నిర్మాణం నిలిపివేయాల్సి వచ్చినట్లు తెలుస్తోంది. సుమారు 50 అడుగులు వరకు ఇంకా రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. సీసీ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయి నెల రోజులైనా ఇంజినీరింగ్ అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనివల్ల ముఖ్యంగా ప్రతి రోజు నూకాంబిక ఆలయానికి వెళ్లే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన రహదారి గుంతలుగా మారడంతో వాహనచోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. విద్యా సంస్థలు, శుభకార్యాలకు అవసరమయ్యే కల్యాణ మండపాలు, పరవాడ నియోజకవర్గం నుంచి అనకాపల్లి పట్టణానికి వచ్చే ప్రజలకు ఈ మార్గం ఎంతో ఉపయోగం. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రహదారిని అసంపూర్తిగా నిలిపివేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ రహదారి నిర్మాణ పనులను పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై జీవీఎంసీ అనకాపల్లి జోన్ డీఈ గోపాలకృష్ణను వివరణ కోరగా మరికొద్ది రోజుల్లో ఈ రహదారిని పూర్తిచేసి ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నూకాంబిక ఆలయానికి వెళ్లే మార్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన సీసీ రోడ్డు

ప్రతీ విద్యార్థి వేదం నేర్చుకోవాలి: ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి వేదం నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. శారదానది ఒడ్డున అనకాపల్లి బ్రాహ్మణ సేవా సంఘం నిర్మించిన పితృ కార్యాల భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేదంలోనే సంస్కారం, సంస్కృతి ఉన్నాయన్నారు. వేదంలో పటిష్టమైన విద్యా వ్యవస్థ ఉందని, అందుకే వేద విద్యాభ్యాసకులు అగ్రస్థానానికి రాగలుగుతున్నారని పేర్కొన్నారు. తానైతే భారతరత్న దివంగత ప్రధాని పీవీ నరసింహారావుతో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పలు భాషల్లో అపారమైన ప్రావీణ్యంతో ఆయన చైర్మన్‌గా ఉన్న కమిటీలో తాను కన్వీనర్‌గా ఉండడం తన అదృష్టమన్నారు. భారతరత్న వాజిపాయ్ లాంటి వారితో పనిచేసే అవకాశం రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రస్తుత రోజుల్లో సంస్కృతిని, వేదాలు కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వేదాలు కాపాడే బాధ్యత అందరిపైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. పితృ కార్యాల భవనాన్ని మంచి ఉద్దేశంతో అనుకున్న సమయానికి పూర్తి చేసిన గంటి రవి, శ్రీకాంత్, ఇతర సోదరులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల ప్రతినిదులు, ప్రజలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

నేడు ప్రజా దర్బార్

అనకాపల్లి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్టు చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ తెలిపారు. ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో తాము ప్రత్యక్షంగా పాల్గొంటామని చెప్పారు. వీఎంఆర్‌డీఏకు సంబంధించిన అన్ని రకాల వినతులు స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

పంట పొలాల్లో కాలిబాటలు ఏర్పాటుచేయాలి

తుమ్మపాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సిబ్బంది ద్వారా పంట పొలాల్లో కాలిబాటలను ఏర్పాటు చేసే చర్యలు చేపట్టాలని తుమ్మపాల రైతులు కోరారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన ఉపాధి హామీ గ్రామసభలో పలువురు రైతులు తమ సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు పీలా మురళీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని రైతులకు ఉపయోగపడే పనులకు వినియోగించాలన్నారు. ఈ పనులపై క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ ఉంచాలన్నారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం గ్రామసభలో ఉపాధి హామీ పనుల వార్షిక ప్రణాళికను సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆశాజ్యోతి, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు



సత్యసాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ప్రాంగణంలో భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి బాబా చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భగవాన్ సత్యసాయిబాబా బోధనల్లో సేవ, ప్రేమ, శాంతి, సత్యం, ధర్మం వంటి మానవ విలువలకు ప్రతీకగా నిలిచాయని పేర్కొన్నారు. బాబా సేవాతత్వాన్ని అనుసరిస్తూ అనకాపల్లి జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో వై.సత్యనారాయణరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి పట్టణంలో...



గాంధీనగరంలో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వాడవాడలా సత్యసాయి శత జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గవరపాలెం పరమేశ్వరిపార్కు వద్ద ఆలయం, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సత్యసాయి మందిరం, గాంధీనగరం పాతకోర్టు వీధిలోని సత్యసాయి మందిరాల్లో ఈ వేడుకలను నిర్వహించారు. వేకువజామున మూడు ఆలయాల పరిధిలో భక్తులు నగర సంకీర్తన చేపట్టారు. అలాగే ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై బాబాను దర్శించుకున్నారు. గాంధీనగరం పాత కోర్టు వీధిలో మధ్యాహ్నం వందలాది మందికి అన్నసమారాధన నిర్వహించారు. దొండా వరహాలదొర 300 మందికి వస్త్రాలు పంపిణీ చేశారు. సాయంత్రం కూడా మందిరాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. గవరపాలెం సత్యసాయి బాబా మందిరంలో మాజీ ఎమ్మెల్సీ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు సత్యసాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. మందిరం కమిటీ చైర్మన్ కేవీ.మహేశ్వరరావు, కో-కన్వీనర్ యల్లపు మాధవరావు నాగ జగదీశ్వరరావును సత్కరించారు. అనంతరం కమిటీ ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో భోగలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కె.సత్యనారాయణ, మళ్ల సాయి, మళ్ల స్వామి, పి.నాయుడు, కె.మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం: సాయినగర్ కాలనీలో భగవాన్ సత్య సాయిబాబా శత జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సబ్బవరం సత్యసాయి సేవా కేంద్రం అధ్యక్షులు సాయిరాం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో బీజేపీ నాయకులు చొక్కాకుల వెంకటరావు పాల్గొన్నారు. బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి, కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బాబా సేవలు నేటి తరానికి ఆదర్శమన్నారు. అనంతరం చొక్కాకుల నిధులతో సమకూర్చిన చీరలు, దుప్పట్లు పేదలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బలిరెడ్డి అప్పారావు, జి.నరసింగరావు, బర్ల రమణ, ఎం.చక్రవర్తి, డి.రామునాయుడు, బలిరెడ్డి గోవింద, రెడ్డి రామునాయుడు, పట్నాయక్, రాం ప్రసాద్, సామ్రాట్, గొంద దేవుడువివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పిద్మజ ఆధ్వర్యంలో సత్యసాయిబాబా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపీపీ బోకం సూర్యకుమారి బాబా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తహశీల్దార్ చిన్నికృష్ణ, ఏవో పీవీ పంతులు, పట్నాయక్, సర్పంచ్‌లు దెడ్డం ప్రసాదరావు, ఎస్.నారాయణమూర్తి, పి.వెంకటరమణ, బి.గంగునాయుడు, ధనిమిరెడ్డి శ్రీనువాసరావు, వీఆర్వోలు ఈశ్వరరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కశింకోటలో...

కశింకోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం సత్యసాయి శతజయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగ లక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.తిరుమలరావు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగ గున్నయ్యనాయుడు, ఎంపీడీవో, తహశీల్దార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

తుమ్మపాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపడుతున్నదని మండల వ్యవసాయ అధికారి పి.రంగాచారి చెప్పారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ శాఖ సిబ్బందితో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి వ్యవసాయ, పశు సంవర్ధక, సచివాలయాల ఉద్యోగులు నేరుగా రైతుల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. అలాగే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలన్నారు. వ్యవసాయంలో అవలంభించాల్సిన విధానాలను రైతులకు వివరించాలన్నారు. పురుగు మందుల వాడకాన్ని తగ్గించి వ్యవసాయం చేయాలన్నారు. రానున్న రబీ సీజన్‌లో మార్కెట్ ఆధారిత పంటలను పండించేందుకు చొరవ చూపాలని ఏవో సూచించారు. అనకాపల్లి మండలంలో ఆరు రోజుల పాటు అధికారులు బృందాలుగా ఏర్పడి రైతులను కలిసి పలు సూచనలు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి రంగాచారి

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం

కొత్తూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ పెంటకోట రామారావు కేక్ కట్ చేసి ఆదివారం క్యాడెట్లకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రైల్వే స్టేషన్, కాంప్లెక్స్‌లో శరణార్థులకు దుప్పట్లు అందజేశారు. ప్రభుత్వాసుపత్రిలో దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. క్యాడెట్లకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ గెల్లా జయబాబు బహుమతులు అందజేశారు. కళాశాల నుంచి ఆర్మీ వింగ్ నుంచి ఆరుగురు క్యాడెట్లు అగ్నివీర్‌కు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు శ్రీధరాల కృష్ణపేర్రాజు, కరస్పాండెంట్ పెంటకోట వెంకట రామారావు, వైస్ ప్రిన్సిపాల్ టి.నిరంజన్‌కుమార్, సూపరింటెండెట్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

» ఐదుగురికి రూ.3.09 లక్షల మంజూరు పత్రాల పంపిణీ

» జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రామకృష్ణ

కశింకోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురైన పేదలకు సీఎం సహాయ నిధి అండగా ఉంటున్నదని జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) అన్నారు. కశింకోట మండలంలోని తాళ్లపాలెం, పరవాడపాలెం, చెరకాం, భీమవరం గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న లబ్ధిదారులను పరామర్శించి, వారికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. మొత్తం ఐదుగురు లబ్ధిదారులకు రూ.3,09,427 మంజూరు పత్రాలను నేరుగా అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేదలను ఆదుకునేందుకే సీఎం సహాయ నిధి అన్నారు. నియోజకవర్గంలో 16 నెలల కాలంలో వందలాది మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాలతో మంజూరు చేశామన్నారు. భవిష్యత్తులో కూడా ఈ సహాయం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలు అందిస్తున్న దృశ్యం

రైవాడ రిజర్వాయర్‌లో నాటు పడవ బోల్తా

» ఒకరి మృతి, ఇద్దరు గల్లంతు

» ప్రాణాలతో బయపడ్డ మరో యువకుడు



జీవన్ (ఫైల్ ఫొటో)

అనంతగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైవాడ రిజర్వాయర్‌లో నాటు పడవ బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా.. ఇద్దరు గల్లంతయ్యారు. మరో యువకుడు ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ సంఘటన జీనబాడు పంచాయతీ బోటు రేవు సమీపంలో ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి...

మండలంలోని జీనబాడుకు చెందిన గాలి అప్పలరాజు(22) అటవీశాఖలో వాచర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రిజర్వాయర్‌లో తన స్నేహితుడు జాలడ ప్రసాద్‌తో కలిసి నాటుపడవపై రైవాడ వెళ్లారు. వీరు తిరుగు ప్రయాణం అవుతుండగా. అదే సమయంలో జీనబాడుకు చెందిన గంజాయి జీవన్(18), డెబర రమేశ్ (18) కాలినడకన వంతెన వైపు వస్తున్నారు. దీంతో వారిని పడవలో ఎక్కించుకుని రైవాడ డ్యామ్ నుంచి జీనబాడు వస్తుండగా బోటురేవు సమీపంలో నాటుపడవ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గంజాయి జీవన్ (18) మృతి చెందగా.. గాలి అప్పలరాజు (22), డెబర రమేశ్ (18) గల్లంతయ్యారు. జాలడ ప్రసాద్ నాటుపడవను పట్టుకుని గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో పశువులు మేపుతున్న జాలడ ప్రసాద్ తండ్రి సత్యం బోటుతో వెళ్లి ప్రసాద్‌ను రక్షించాడు. అనంతరం గాలింపు చర్యలు చేపట్టగా గంజాయి జీవన్ మృతదేహం లభ్యమైంది. గాలి అప్పలరాజు, డెబర రమేశ్‌ల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. సమాచారం మేరకు దేవరాపల్లి ఎస్‌ఐ సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని, ప్రమాద కారణాలపై ఆరా తీశారు.

వ్యాయామశాల భవనం ప్రారంభం



వ్యాయామం చేస్తున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేల్పులవీధి శ్రీరామదేవ వ్యాయామ సంఘం నూతన భవన జిమ్‌ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిమ్ పరికరాలను పరీక్షించి వ్యాయామం చేశారు. 2009 ఫిబ్రవరి 28న వ్యాయామశాల సంఘం భూమి పూజ కొణతాల చేతుల మీదుగా జరగ్గా, నేడు ఏసీ భవనం కూడా ఎమ్మెల్యే ప్రారంభించడంపై వ్యాయామశాల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కూటమి నాయకులు, వ్యాయమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

కిటకిటలాడిన నూకాంబిక ఆలయం



అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

అనకాపల్లి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున బాలాలయంలో అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం ఇచ్చిన తరువాత భక్తులకు దర్శనం కల్పించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ముఖ్యంగా అయ్యప్పస్వామి భక్తులతో ఆలయం కోలాహలంగా మారింది. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం పెట్టి కుటుంబ సభ్యులంతా సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం వరకు అమ్మవారి దర్శనానికి భక్తులు వస్తూనే ఉన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఆలయ చైర్మన్ పీలా నాగశ్రీను, ధర్మకర్తలు, అధికారులు చర్యలు చేపట్టారు.

గోపాలపురం జగనన్న కాలనీలో చోరీ

» నాలుగు తులాల బంగారం.. 15 తులాల వెండి అపహరణ

కొత్తూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం జగన్న కాలనీలో శనివారం రాత్రి చోరీ జరిగిందని అనకాపల్లి రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్ తెలిపారు. కాలనీలో నివాసం ఉంటున్న బొడ్డేడ వెంకట కన్యాకుమారి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి శనివారం సాయంత్రం వెళ్లారని చెప్పారు. ఉదయం వచ్చి చూసేసరికి ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉందని, బీరువాలో నాలుగు తులాల బంగారం, 15 తులాల వెండి ఆభరణాలు కనిపించలేదని బాధితులు ఫిర్యాదులో తెలిపారని సీఐ చెప్పారు. దీంతో క్లూస్ టీంతో సంఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలను సేకరించినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

నాగచైతన్య అభిమానుల సేవా కార్యక్రమాలు



వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న అభిమానులు

అనకాపల్లి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగరం సత్యసాయి సేవా సమితిలో ఆదివారం హీరో అక్కినేని నాగచైతన్య జన్మదిన వేడుకలను అభిమానులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అనకాపల్లి శాఖ అధ్యక్షుడు ఎస్.భానుచందర్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పేదలకు అన్నదానం, వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేశారు. 82వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి పోలారపు త్రినాథ్, బాలకృష్ణ, ఎన్టీఆర్ ఫ్యాన్స్ ప్రతినిధి మళ్ల సంతోశ్, పట్టణ నాగార్జున ఫ్యాన్స్ అధ్యక్షులు సిహెచ్.అవతారం వీటిని అందజేశారు. కార్యక్రమంలో జగన్నాథస్వామి ఆలయ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, 82వ వార్డు టీడీపీ అధ్యక్షుడు దాడి జగన్, అక్కినేని అభిమానులు షేక్ రియాజ్, మువ్వల రాజు, రమణ, శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం పెంచుతాం

అనకాపల్లి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ గొప్పతనాన్ని పెంపొందించడమే జన విజ్ఞానం లక్ష్యమని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కడిమిశెట్టి త్రిమూర్తులురెడ్డి స్పష్టం చేశారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి ప్రతిభా పరీక్ష పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో 35 ఏళ్లుగా ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. రాత పరీక్ష, క్విజ్, ప్రయోగ పరీక్షల ఆధారంగా జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంఎస్‌వీఎస్పీ వర్మ, నాగచంద్ర, సంస్థ ప్రతినిధులు పిళ్లా రవిశంకర్, కొణతాల జగన్మోహన్, మల్లారెడ్డి శంకర్ ప్రసాద్, కె.రామ్మోహన్, రంగబాబు, జడ్పీటీసీ కో-ఆప్షన్ సభ్యుడు జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



బోర్‌వెల్ నిర్మాణానికి భూమి పూజ చేసిన జడ్పీటీసీ సభ్యుడు బాలయ్య

చింతపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాల-2 విద్యార్థుల తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్టు స్థానిక జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. ఆదివారం పాఠశాలలో రూ.3 లక్షల జడ్పీ నిధులతో తాగునీటి పథకానికి స్థానిక సర్పంచ్ దురియా పుష్పలతతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు తాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో సమస్య గుర్తించి జడ్పీ నిధులు కేటాయించామన్నారు. పాఠశాల ఆవరణలో బోరు నిర్మించామన్నారు. మోటారు అమర్చి ట్యాంక్, కొళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు.ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు,సర్పంచ్‌ను హెచ్‌డబ్ల్యూవో ఉగ్రంగి గణేశ్వరరావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి, కోఆప్టెడ్ సభ్యుడు నాజర్‌వల్లి పాల్గొన్నారు.

అనాథ బాలికకు ఆర్థిక సాయం



అనిత లక్ష్మికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

కొయ్యూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చిన్న వయస్సులో తల్లి, తండ్రితో పాటునా అనుకున్న వారినందరినీ కోల్పోయిన మూలపేట పంచాయతీ కొండసంతకు చెందిన బాలిక మునోజి అనిత లక్ష్మి కొయ్యూరుకు చెందిన రెవెన్యూ అధికారి రూ. 7 వేల సాయంగా అందించి మానవత్వ చాటుకున్నారు. అనిత లక్ష్మి తల్లి భవాని తల్లిని ఎనిమిదేళ్ల కిందట మృతి చెందారు. తండ్రి పోతురాజు, అమ్మమ్మ రావుల దేవుడమ్మల సంరక్షణలో పెరిగింది. అయితే, వీరిద్దరూ మూత్ర పిండాలకు సంబంధించి వ్యాధితో ఈ నెల 5వ తేదీన ఒకే రోజున చనిపోయారు. ఈ స్థితిలో హైదరాబాద్‌కు చెందిన సూర్యనారాయణ అనే వ్యక్తితో పాటు జీకే వీ ధి రెవెన్యూ కార్యాలయంలో డీటీగా పని చేస్తున్న కొయ్యూరుకు చెందిన దుమంతి సత్యనారాయణ కలసి ఆదివారం బాధితురాలిని పరామర్శించి నిత్యావసరాలతో పాటు రూ. 7 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో భవానీ ఓంకార్, గ్రామస్థులు శ్రీను, అనిల్, సోమలింగం పాల్గొన్నారు.

విస్తృతంగా పోలీసు తనిఖీలు



పాడేరు అంబేడ్కర్ కూడలిలో వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ సురేష్, పోలీసులు

పాడేరురూరల్ నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా ఎన్‌కౌంటర్ నేపథ్యంలో నిరసన చేపట్టాలని మావోయిస్టులు ఇచ్చిన పిలుపు నేపథ్యంలో స్థానిక ఎస్ఐ ఎల్.సురేష్ బృందం ఆదివారం పాడేరు ప్రధాన రహదారుల్లో విస్తృతంగా వాహన తనిఖీలను చేపట్టారు. వాహనదారుల రికార్డులను పరిశీలించారు. వారి వివరాలపై ఆరాతీశారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఆదివారం రాత్రి కూడా ఆర్టీసీ డిపో నుంచి వెళ్లే నైట్ హాల్ట్ బస్సులను ఆయా మండల కేంద్రాల్లోని పోలీసు స్టేషన్‌లకే పరిమితం చేశారు. పోలీసులు రాత్రి వేళల్లో పాడేరు పరిసర ప్రాంతాల్లో గస్తీని ముమ్మరం చేస్తున్నామని ఎస్ఐ సురేష్ తెలిపారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పంచాయతీ కార్యదర్శి ఎంపిక



ఎంపికైన పవన్

జి.మాడుగుల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరాపల్లి పంచాయతీ కార్యదర్శి పవన్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయిఎంపిక పోటీల్లో ఆయన అర్హత సాధించారు. త్వరలో గోవాలో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలలో ఆయన ఏపీ నుంచి పాల్గొననున్నారు. ఆయనను పలువురు అభినందించారు.

హుకుంపేటలో తాగునీటి సమస్య



రామాలయంవీధిలో అసంపూర్తిగా ఉన్న బోరు

హుకుంపేట నవంబరు 23 (ఆంధ్రజ్యోతి: మండల కేంద్రంలో పలు వీధుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. రామలయం వీధి, అడ్డుమండ, చాకలివీధి వాసులు దూరంనుంచి నీటిని తెచ్చుకుని అవసరాలు తీర్చుకుంటున్నారు. రామలయం వీధిలో బోరు తవ్వి హెడ్‌ను అమర్చి చాలా రోజులు గడుస్తున్నా అందుబాటులో తేలేదు. చాకలిపేట, అడ్డుమండ వీధుల్లో గతంలోని కోళాయి లైన్ పైపులు ఏర్పాటు చేసినా వాటినుంచి చుక్క నీరు రావడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బోరు అసంపూర్తిగా నిర్మించినాసంబంధిత కాంట్రాక్టర్ బిల్లులు చేసుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాగునీటి సమస్య పరిష్కారంలో అధికారులు విఫలం కావడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గ్రామ శివారునుంచి నీటి తెస్తున్న మహిళలు



కలెక్టరేట్‌లో సత్యసాయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఆర్డీవో, జానపదకళల చైర్మన్ గంగులయ్య, తదితరులు



కొయ్యూరులో నివాళులర్పిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో, తహసీల్దారు తదితరులు

ఘనంగా సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు

పాడేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పుటపర్తి సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లో ఆయనకు ఆదివారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్యసాయి చిత్రపటానికి రెవెన్యూ డివిజన్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, రాష్ట్ర జనపదకళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాల్లో చేపడుతున్న తాగునీటి పథకాల నిర్మాణం, ఇతర సేవా కార్యక్రమాలను పలువురు కొనియాడారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ పరిపాలనాధికారి కె.అప్పలస్వామి, కలెక్టరేట్ సిబ్బంది, సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

కొయ్యూరులో..

కొయ్యూరు: సేవా కార్యక్రమాలతో ఎందరో ప్రాణాలను కాపాడిన మహానుభావుడు సత్యసాయిబాబా అని ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు, తహసీల్దారు ఎస్‌కేవీ ప్రసాదరావు, ఎంపీడీవో జీడీవీ ప్రసాదరావు తదితరులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా ట్రస్టుల ద్వారా అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హిడ్మా ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ చేపట్టాలి

▸ ఆదివాసీ విద్యార్థి, ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు



మాట్లాడుతున్న ఆదివాసీ విద్యార్థి, ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు

పాడేరురూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరం అటవీ ప్రాంతంలో జరిగిన మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు మడవి హిడ్మా ఎన్‌కౌంటర్‌పై హైకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ జరపాలని దండకారణ్య ఉద్యోగ సమితి జాతీయ కార్యదర్శి సమరెడ్డి మాణిక్యం, డీఎల్‌వో జాతీయ కార్యవర్గ సభ్యుడు పెనుమాల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. హిడ్మా ఎన్‌కౌంటర్‌పై ఆదివారం పాడేరులోని జీఎస్‌యూ భవనంలో ఆదివాసీ విద్యార్థి, ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులతో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బూటకపు ఎన్‌కౌంటర్లను తమ సంఘాలు ఖండిస్తున్నాయన్నారు. మారేడుమిల్లి టైగర్ జోన్ అడవుల్లో జరిగిన హిడ్మా ఎన్‌కౌంటర్ బూటకమని, విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హిడ్మాను పట్టుకొని మారేడుమిల్లి తీసుకువచ్చి హత్య చేశారని ఆరోపించారు. ఇదే విషయం దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతుందని, దీనిపై తక్షణమే హైకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులు ఆయుధాలు విడిచి లొంగిపోవాలని, వారిపై ఉన్న రివార్డ్‌తోపాటు పునరావాసం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తూ మరోవైపు ఎన్‌కౌంటర్ల పేరిట హత్యలు చేయడం దేనికి సంకేతమని ప్రశ్నిస్తున్నామన్నారు. ప్రభుత్వం, మావోయిస్టు మధ్య జరుగుతున్న యుద్ధంలో ఇన్‌ఫార్మర్లు, కోవర్టుల పేరిట ఆదివాసీ బిడ్డల ప్రాణాలకే ఎక్కువ నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర, రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు వందలాది మంది మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోతున్నారు. అయితే, ఆదివాసీయేతర కేంద్ర కమిటీ సభ్యులకు రక్షణ కల్పిస్తున్న ప్రభుత్వాలు, ఆదివాసీల ముద్దు బిడ్డ హిడ్మాను నిరాయుధుడిని చేసి ఎన్‌కౌంటర్ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆయన ఆదివాసీ కావడంతోనే హత్య చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉపాధ్యాయ సంఘం మాజీ అధ్యక్షుడు పలాసి కృష్ణారావు, దండకారణ్య విమోచన సమితి సలహాదారు చెండా కేశవరావు, ఆదివాసీ సేన జిల్లా కన్వీనర్ చుంచు రాజుబాబు, డీఎల్‌వో రాష్ట్ర కార్యదర్శి కవడం కాసులమ్మ, జేఏసీ కో-కన్వీనర్ జవ్వాది సూర్యనారాయణ, డీఎల్‌వో జిల్లా నాయకులు కిముడు కొండయ్య, కె.వెంకాయమ్మ, కె.మచ్చమ్మ, డీఎస్‌వో నాయకులు ఎన్.జాన్‌బాబు, కాంగ్రెస్ నాయకుడు జి.భానుచందర్ పాల్గొన్నారు.

ఏపీటీడబ్ల్యూటీఏ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న సంఘ ప్రతినిధులు

పాడేరురూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షే ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగినట్టు ఏపీటీడబ్ల్యూ టీఏ రాష్ట్ర అధ్యక్షులు రేగం సూర్యనారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాల(తలారిసింగి)లో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చిట్టపులి శ్రీనివాసు పడాల్, రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ పడాల్ ఆధ్వర్యంలో ఏపీటీడబ్ల్యూ టీఏ జిల్లా సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశామన్నారు. తొలుత పాత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నీలకంఠం, ఎం.శోభన్‌బాబులు గత రెండేళ్ల నిర్వహించిన కార్యనిర్వాహణ కార్యక్రమాలపై నివేదికను సమర్పించారన్నారు. అనంతరం ఎలక్షన్ కమిషన్ సభ్యులుగా జీవీవీ.ప్రసాదరావు, ఉల్లి అర్జున్, పలాసి కృష్ణారావు, కిల్లో గంగన్న పడాల్ వ్యవహరించి నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడిగా కంబిడి నీలకంఠం, జిల్లా అధ్యక్షుడిగా కోడా చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శిగా కూడా రాంబాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా సాగోరి రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్.అనీల్‌కుమార్, కోశాధికారిగా పూజారి ఉపేంద్రతో పాటు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారన్నారు. ఈ సమావేశంలో ఎం.అప్పారావు, కె.రామారావు, టి.లింగమూర్తి, ఎస్.రామారాజు పడాల్, కె.నాగేశ్వరరావు, జీజేఆర్.మజ్జి పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం'



గ్రామ కమిటీ సమావేశానికి హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

గూడెంకొత్తవీధి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు టీడీపీ కార్యకర్తలు సన్నద్ధం కావాలని పార్టీ సంకాడ గ్రామ కమిటీ అధ్యక్షుడు దేశగిరి గోవిందరావు అన్నారు. ఆదివారం సంకాడలో టీడీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పంచాయతీ పరిధిలో ఎంపీటీసీ సభ్యుడు, సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొట్టడం లక్ష్మణరావు, యూనిట్ ఇన్‌చార్జి మామిడి చంటిబాబు, దేశగిరి గంగాధర్, బొజ్జిపడాల్, భీమరాజు, గురుమూర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సత్యసాయి భక్తుడి మృతి

హుకుంపేట నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి); మండలంలోని తాడిపుట్టు పంచాయతీ సత్యసాయి బాబా మందిరం సమీపంలోని పాడేరు- అరకు ప్రధాన మార్గంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. నూర్పురాయి గ్రామానికి గురాయి కురబోయి శ్రీను (45) తాడిపుట్టులోని సాయిబాబా మందిరంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం రాత్రి 7 గంట సమయంలోతన గ్రామానికి స్కూటీపై వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి లోనయ్యారు. తలకు బలమైన గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఈ విషయం తెలిసిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పాడేరు జిల్లా ఆస్పత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు.

'శిశు మరణాలను నిరోధించాలి'



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న గిరిజనసంఘం నేతలు

ముంచంగిపుట్టు, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో శిశు మరణాల నిరోధంపై వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టిసారించాలని గిరిజనసంఘం జిల్లా నేతలు కె.త్రినాథ్, కె.నర్సయ్య డిమాండ్ చేశారు. దారెల పంచాయతీ పరిధిలో డి.కుమ్మరిపుట్టు, తలింబ, చివుకుచింత గ్రామాలను ఆదివారం సందర్శించారు. ఆయా గ్రామాల్లో శిశువులను కోల్పోయిన తల్లిదండ్రులతో మాట్లాడి, మృతికి గల కారణాలను, వారి అందిన వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ శిశువులను కోల్పోయిన తల్లులు వి.రాజేశ్వరి, జి.కాంతమ్మలు ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్నారని, వారికి మెరుగైన వైద్య సేవలు అం దించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని, ఉచితంగా బియ్యం, పప్పు, నూను, ఇతర నిత్యావసర సరుకులు అందించాలని కోరారు. గ్రామాల్లో ఐదు శిశు మరణాలు జరగడానికి గల కారణాలను తెలుసుకోవాలని, ఇటు వంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కె.శ్రీను, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో టీడీపీ కార్యకర్త మృతి



శ్రీధర్ మృతదేహం

ముంచంగిపుట్టు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ మర్రిపుట్టు గ్రామానికి చెందిన టీడీపీ పార్టీ కార్యకర్త కె.శ్రీధర్ (25) ఆదివారం విద్యుదాఘానికిలోనై మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీధర్ ఇంట్లో పాడైన ఎలక్ట్రికల్ స్టౌ మరమ్మతు పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు లోనై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని అంబులెన్స్‌లో స్థానిక సీహెచ్‌సీకి తీసుకురాగా, వైద్య సేవలు పొందుతూ మృతి చెందారు. మృతునికి భార్యతో పాటు ఒక కుమారుడు ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జె.రామకృష్ణ తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షురాలు సీహెచ్‌సీకి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. అలాగే, సర్పంచ్‌లు ఎస్.సుభాష్, కె.త్రినాథ్, వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, గిరిజనసంఘం నేత ఎం.ఎం.శ్రీను తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్ని నింపారు.

శిశు మరణాలపై అధ్యయనం చేయాలి

పాడేరురూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆదివాసీ ప్రాంతాల్లో శిశు మరణాలపై సమగ్ర అధ్యయనం చేసి అకాల మరణాలను అరికట్టాలని ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, ముంచంగిపుట్టు మండలం దారెల పంచాయతీ డి.కుమ్మరిపుట్టులో జరిగిన శిశు మరణాలపై వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టిని సారించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పించాలని కోరారు.

పొగ మంచు గుప్పెట్లో ముంచంగిపుట్టు

▸ గజగజలాడుతున్న ప్రజలు



ముంచంగిపుట్టులో ఉదయం 9 గంటల సమయంలో మంచు

ముంచంగిపుట్టు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మన్యంలో చలిపంజా విసురుతోంది మండల కేంద్రంలో ఆదివారం తొమ్మిది గంటలైన సూర్యుడు జాడ కనిపించలేదు. దట్టమైన పొగమంచు ఈ ప్రాంతాన్ని పూర్తిగా కమ్మేయడంతో ఉదయం వేళ కూడా సాయంత్రాన్ని తలపిస్తోంది ప్రధాన రహదారులపై పొగమంచుకురవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అం తరాయం నెలకొంటోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగటి వేళలో సైతం లైట్ల వెలుగులో వాహన రాకపోకలు జరుగుతున్నాయి. గత రెండు రోజులుగా తుఫాన్ ప్రభావంతో చలి కాస్త తగ్గినా ప్రస్తుతం చలి మాత్రం పెరిగింది. దీంతో పిల్లలు, వయసు పైబడిన వారు, ఆస్తా రోగులు అవస్థలు పడుతున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరికాస్త పెరిగే అవకాశం ఉందని వాతావరణ పరిస్థితులు సూచిస్తున్నాయి.

సీలేరులో షూటింగ్ సందడి



రవితేజ సినిమా షూటింగ్ కోసంమారెమ్మ ఆలయం వద్ద సెట్ వేస్తున్న దృశ్యం

సీలేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. మజిలీ, నిన్నుకోరి వంటి సినిమాలకు దర్శకత్వం వహించిన శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రి మూవీ బ్యానర్‌పై రవితేజ హీరోగా, సాయికుమార్ తదితర నటులతో రూపుదిద్దుకుంటున్న కొత్త సినిమా చిత్రీకరణ సీలేరులో సోమవారం నుంచి షూటింగ్ ప్రారంభం కానుంది. ఇందుకోసం స్థానిక గ్రామ దేవత మారెమ్మ ఆలయ ఆవరణలో అయ్యప్పస్వామి ఆలయం సెట్ వేస్తున్నారు. సీలేరులో జెన్‌కో ఇండోర్ స్టేడియం వద్ద కూడా షూటింగ్ కోసం సినిమా థియేటర్ సెట్‌ను కూడా డిజైన్ చేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి హీరో రవితేజ, సాయికుమార్, హీరోయిన్, ఇతర నటులు చేరుఉంటారని, సోమవారం ఉదయం మారెమ్మ ఆలయం వద్ద ముహూర్తపు షాట్‌ను తీయనున్నట్లు యూనిట్ వర్గాలు ఈ సందర్భంగా తెలిపాయి. సీలేరులో జెన్‌కో గెస్టుహౌస్‌తో బాటు, ప్రైవేటు లాడ్జీలు సినిమా కళాకారులతోఫుల్ అయి సందడి వాతావరణం నెలకొంది.

వాతావరణంలో మార్పులతో అన్నదాతల ఆందోళన



పాడేరు మండలం గబ్బంగి వద్ద వరి పంటను తరలిస్తున్న రైతులు

పాడేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం లో వాయుగుండంపై వాతావరణ శాఖ హెచ్చరికలతో ఏజెన్సీలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పట్లో వర్షాలు కురిస్తే ప్రస్తుతం చేతి వచ్చే దశలో ఉన్న వరి పంట నాశనమవుతుందని బెంగపడుతున్నారు. దీంతో ఎక్కడిక్కడ కోతలు పూర్తయిన పంటలను కల్లాల్లోకి తరలిస్తున్నారు.

స్టూడెంట్ అసెంబ్లీకి నిరాకరణతో చిన్నారుల్లో నిరాశ

పాడేరురూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న అమరావతిలోని అసెంబ్లీకి పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాల నుంచి ఒక్కొక్క విద్యార్థిని ఎంపిక చేసిన తీరా సమయం సమీస్తుండగా ఇప్పుడు ఒక్క గిరిజన విద్యార్థులను మాత్రమే తీసుకువెళ్లడంతో గిరిజనేతర చిన్నారులు నిరాశకు లోనయ్యారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల ముందు మీరే ఎమ్మెల్యే, మంత్రులుగా వ్యవహరించాల్సి ఉంటుందని ఆశలు రేకెత్తించి, తిరిగి నిరాకరించడంపై గిరిజనేతర చిన్నారులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఈ నెల 26న అమరావతిలో అసెంబ్లీ నిర్వాహణకు ప్రతీ నియోజకవర్గం నుంచి విద్యార్థులను వివిధ స్థాయిలో వాఖ్యాన, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన పాడేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ముగ్గు నవ్యశ్రీ, అరకు నియోజకవర్గ పరిధిలోని కంఠభంసుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సాంబాని దేదీప్య, రంపచోడవరం పరిధిలోని అడ్డతీగల జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి జగత సాయిరమ్యను ఎంపిక చేశారు. అయితే, ప్రతిభలో వీరి తర్వాత నిలిచిన పాడేరు మండలం కందమామిడి పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని కిల్లో అమృత, అరకు పరిధిలోని కంఠభంసుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న చెట్టి లక్ష్మీప్రసన్నను, అడ్డతీగల జడ్పీ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ఇల్లా లక్ష్మీకాంత్‌రెడ్డిని ఎంపిక చేసి తీసుకువెళ్తున్నట్లు ప్రకటించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రతిభను నిరాకరించడం తగదన్నారు.

గుమ్మడికాయలకు గిరాకీ



గుమ్మడికాయలు విక్రయిస్తున్న గిరిజన మహిళలు

ముంచంగిపుట్టు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు పండించిన గుమ్మడి కాయలకు గిరాకీ లభిస్తోంది. వీటిని ఊహించని ధరలు పలుకుతున్నాయి. స్థానిక మార్కెట్‌లో లేత పింజె నుంచి పెద్ద కాయల వరకు సైజును ఒక్కోటి రూ.10 నుంచి రూ.30, రూ.50, రూ.100 వరకు అమ్ముడవుతున్నాయి. పలు వంటకాలకు ఉపయోగపడే గుమ్మడికాయలను కొనుగోలుకు జనాలు ఎగబడుతున్నారు. శనివారం జరిగిన స్థానిక సంతలో గుమ్మడికాయలు గంటల వ్యవధిలోనే హాట్ కేక్‌ల్లా కొనుగోలు చేశారు.

క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభానికి సిద్ధం

... 5వ పేజీ తరువాయి

అత్యవసర వైద్య నిపుణుల పోస్టులు భర్తీ చేయనున్నారు.

ప్రారంభానికి ఏర్పాట్లు

రెండు వారాల్లో క్రిటికల్ కేర్ సెంటర్ భవనాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ విభాగాల్లో రూ.12 కోట్లు విలువ చేసే అత్యాధునిక వైద్య సామగ్రిని సమకూర్చనున్నారు. ఇప్పటికే సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు స్కానర్, సీటీసీ, డిజిటల్ ఎక్స్‌రే వంటి అధునాతన పరికరాలు చేరాయి. త్వరలో వివిధ విభాగాల్లో వీటిని అమర్చనున్నారు. క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయని, త్వరలోనే ప్రారంభానికి ప్రభుత్వం తేదీ నిర్ణయిస్తుందని ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు తెలిపారు.

పర్యాటకుల సందడి

... 5వ పేజీ తరువాయి



బొజ్జన్నకొండ వద్ద సందర్శకులు

సముద్రతీరం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆటపాటలతో సరదాగా గడిపారు. మధ్యాహ్నం అక్కడ చుట్టుపక్కల ఉన్న కొబ్బరి, జీడిమామిడి తోటల్లో వనభోజనాలు చేసి అనంతరం తీరంలో స్నానాలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేలా ఎస్ఐ విభీషణరావు ఆధ్వర్యంలో పోలీసులు డ్రోన్‌తో నిఘా పెట్టి పర్యవేక్షించారు. అలాగే మెరైన్ పోలీసులతో కలిసి స్థానిక పోలీసులు గస్తీ నిర్వహించారు.

పిక్నిక్‌లో విషాదం

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. శ్రీనివాస్ తల్లి రుక్మిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

శారదానదిలో ఇంటర్ విద్యార్థి గల్లంతు

అనకాపల్లి టౌన్: శారదానదిలో ఆదివారం సాయంత్రం ఇంటర్ విద్యార్థి గల్లంతైన సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. విశాఖ నగర పరిధిలోని గోపాలపట్నానికి చెందిన ఎనిమిది మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు పిక్నిక్‌కు అనకాపల్లి వచ్చారు. తుమ్మపాల నుంచి వెంకుపాలెం వెళ్లే రోడ్డులోని శారదానది ఒడ్డున వారు బంతి ఆట ఆడుతున్నారు. బంతి నదిలో పడిపోవడంతో దానిని తీయడానికి ఒక విద్యార్థి దిగి కొట్టుకుపోయాడు. అతనిని రక్షించడానికి ప్రయత్నించి మరో విద్యార్థి కొట్టుకుపోతుంటే అక్కడే ఉన్న మత్స్యకారులు కాపాడారు. అయితే బంతి కోసం దిగి కొట్టుకుపోయిన విద్యార్థి ఆచూకీ తెలియలేదు. సోమవారం ఎస్టీఆర్ఎఫ్ బృందాలతో గాలిస్తామని సీఐ తెలిపారు.

సినీ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ సందడి


అనుపమ పరమేశ్వరన్

నర్సీపట్నం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రముఖ సినీ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ సందడి చేసింది. ఆదివారం నర్సీపట్నంలో ఒక వస్త్ర దుకాణం ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఆమెను చూసేందుకు విద్యార్థులు, మహిళలు, యువతీ యువకులు ఎగబడ్డారు. జన సందోహంలో రోడ్డు కిక్కిరిసి పోయింది. పోలీసులు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూశారు.

బాక్సింగ్ పోటీల్లో తేజస్వినికి బంగారు పతకం


యర్రా తేజస్విని

నర్సీపట్నం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయనగరం రాజీవ్‌గాంధీ స్టేడియంలో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో నర్సీపట్నానికి చెందిన యర్రా తేజస్విని 80 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించింది. వచ్చే నెలలో పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగే ఆలిండియా యూనివర్సిటీ బాక్సింగ్ టోర్నమెంట్‌లో తేజస్విని పాల్గొంటుంది. ఈ పోటీలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు చీఫ్ జ్యూరీగా వ్యవహించారని శాప్ కోచ్ అబ్బు తెలిపారు.

నేడు సీపీఐ నేత రామునాయుడు సంస్మరణ సభ

కృష్ణాదేవిపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం చోద్యం గ్రామంలో సోమవారం దివంగత సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ మండల కార్యదర్శి, జిల్లా కార్యవర్గసభ్యులు జి.రాధాకృష్ణ, మేకా భాస్కరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, జాతీయ సమితి సభ్యులు జేవీ సత్యనారాయణ, తదితరులు హాజరవుతారన్నారు.

'నైట్ వాచ్‌మన్లకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలి'

నర్సీపట్నం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేసే రాత్రి పూట కాపలాదారులకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలని జిల్లా నైట్ వాచ్‌మన్ల సంఘం గౌరవ అధ్యక్షుడు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీ నాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తురకబడి)లో జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నైట్ వాచ్‌మన్లకు జీత భత్యాలు చాలా తక్కువన్నారు. ఇప్పటి వరకు ఇస్తున్న రూ.6 వేలు వేతనాన్ని రూ.10 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. రాత్రి సమయంలో పని చేసే వీరికి బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వాచ్‌మన్ల సంఘం తరఫున డీజీ నాథ్‌కి శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అల్లు అప్పారావు, వాచ్‌మన్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.చంటి, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం : సీఐ

చోడవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పెరిగిపోయిన సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు పెద్దలకు సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాల్సిన బాధ్యత తీసుకోవాలని స్థానికసీఐ బి. అప్పలరాజు కోరారు. ఆదివారం స్థానిక వివేకానంద కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన సైబర్ నేరాలు, కొత్తగా అమలులోకి వచ్చిన నేర చట్టాల గురించి అవగాహన కల్పించారు. అనవసరంగా అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొని భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

జనసైనికుడి కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సాయం

చోడవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దుపాలెం గ్రామానికి చెందిన జనసైనికుడు గాలి సూరిబాబు కుటుంబానికి రూ. 5లక్షలు బీమా సాయాన్ని ఆదివారం తాడేపల్లిలో ఎమ్మెల్సీ జనసేన నాయకుడు కొణిదెల నాగబాబు అందజేశారు. ఏడాది క్రితం గాలి సూరిబాబు క్వారీ పనిలో ఉండగా ఎక్స్‌కవేటర్ బకెట్ తగిలి మృతిచెందాడు. దీంతో సూరిబాబు కుటుంబానికి ప్రమాద బీమా కింద మంజూరైన రూ.5లక్షల పరిహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకుడు గూనూరు మూలినాయుడు, సూరిబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పంట కాలువల పనులకు భూమి పూజ

దేవరాపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమిరాం, కలిగొట్ల, బి.కింతాడ బ్రాంచ్ చానల్ పంట కాలువల పనులకు రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే బండారు.సత్యనారాయణమూర్తి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి రూ.పది లక్షలు మంజూరు చేశారని, దీని వలన గట్లు అభివృద్ధి, మదుముల మరమ్మతులు చేస్తున్నట్టు పాత్రునాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, జనసేన మండల అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

ఎం.అలమండలో 120 మందికి వైద్య పరీక్షలు

దేవరాపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అలమండలో ఆదివారం నిర్వహించిన చిన్న పిల్లల వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రాహుల్ చైల్డ్ క్లినిక్ ఆధ్వర్యంలో 120 మంది పిల్లలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశామని వైద్యుడు రాహుల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జలాశయ చైర్మన్ పాత్రునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, గోవింద తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ ఆదాయాన్ని పెంచడానికి చర్యలు

రోలుగుంట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సొసైటీ ఆదాయాన్ని మరింత పెంచడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు రోలుగుంట పీఏసీఎస్ చైర్‌పర్సన్ సుర్ల బాబులునాయుడు అన్నారు. పీఏసీఎస్ వెనుక నూతనంగా నిర్మించిన దుకాణాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ రూ.22 కోట్ల టర్నోవర్‌తో వ్యాపారం చేస్తున్నామని, వచ్చే ఏడాది నాటికి రూ.30 కోట్లకు పైగా టర్నోవర్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బుంగా అప్పారావు, యర్రంశెట్టి వెంకటరమణ, సొసైటీ సీఈఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి భూమి పూజ

బుచ్చెయ్యపేట, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): మండలంలో పెదపూడి శివారు చిన్నయ్యపాలెంలో ఆదివారం రామాలయ నిర్మాణానికి విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ భూమి పూజ చేశారు. ఈ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు రూ. పది లక్షలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, సర్పంచ్ వరకృష్ణ, దొడ్డి కిశోర్, రుత్తల రాము, మధు, కరణం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	103.00
లైవ్ ధర	123.00
విత్ స్కిన్	216.00
స్కిన్ లెస్	226.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	635
విజయనగరం	639
శ్రీకాకుళం	639

ఘనంగా సత్యసాయి శత జయంతి వేడుకలు

నర్సీపట్నం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సత్యసాయి శత జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 120 మంది భక్తులు మహా నగర కీర్తన చేశారు. శారదానగర్‌లోని సత్యసాయి మందిరంలో ప్రత్యేక పూజలు, భజనలు, సామూహిక వ్రతాలు, మహా నారాయణ సేవ చేశారు. పేదలకు వస్త్రదానం చేశారు. సబ్ జైలులో ఖైదీలకు, ఏరియా ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. సాయంత్రం మహా సత్యసాయి నామ సంకీర్తన ఉయ్యాల సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రామకృష్ణ, సత్య సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.


నర్సీపట్నంలో సామూహిక సత్యసాయి వ్రతాలు జరుగుతున్న దృశ్యం

గొలుగొండలో..

గొలుగొండ: మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయాల్లో ఆదివారం సత్యసాయిబాబా జయం తి వేడుకలు నిర్వహించారు. సత్యసాయి చిత్రపటానికి ఇన్‌చార్జి ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి మూర్తి, తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలు, ఆర్ఐ కొండబాబు పూలమాలలు వేశారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

కృష్ణాదేవిపేట: ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో ఆదివారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఏఎల్‌పురంలో పది మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులతో పాటు 50 మంది నిరుపేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమలో సేవా సమితి నిర్వాహకులు పల్లి సత్యనారాయణ, రిటైర్డ్ హెచ్ఎం పీవీ రమణ, శ్రీను, రమణ, గోవిందు, వాసు, తదితరులు పాల్గొన్నారు.

నాతవరంలో...

నాతవరం: స్థానిక ఎంపీడీవో ఎం.సత్యశ్రీనివాసు ఆధ్వర్యంలో సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సత్యసాయి చిత్రపటానికి ఎంపీడీవో ఎం.సత్యశ్రీనివాసు, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం పీఏసీఎస్ చైర్మన్ సింగంపల్లి సన్యాసిదేముడు, ఎస్ఐ వై.తారకేశ్వరరావు, మాజీ ఎంపీపీ ఎన్.విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో..

సత్యసాయి ఆధ్యాత్మిక సేవా మార్గం ప్రపంచానికే మార్గదర్శకమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. కూండ్రపువానిపాలెంలో ఆదివారం శ్రీరామ సత్యసాయి మందిరంలో సత్యసాయ శత జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యసాయి బోధించే ప్రేమ, సేవ, శాంతి, సత్యం, ధర్మం వంటి ఆధ్యాత్మిక సూత్రాలు అందరికీ ఆదర్శనీయమన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు, నిత్యావసర వస్తువులు, వంద మంది పేదలకు వస్త్రాలు, దుప్పట్లు, దివ్యాంగులకు ఉపకరణాలు, గర్భిణులకు పోషకాహారాన్ని పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. కార్యక్ర మంలో రాష్ట్ర కొప్పుల వెలమ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్, ప్రత్యేకాధికారిణి ఎం.ఆశాదేవి, సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, జిల్లా సమన్వయకర్త కన్నూరు అప్పలనాయుడు, తహశీల్దార్ ఎం. భుజంగరావు, డిప్యూటీ ఎంపీడీవో రమణి, ఏవో అప్పలరాజు, ఎస్ఐ ధనుంజయ్ పాల్గొన్నారు.


కె.కోటపాడు: నిత్యావసర వస్తువులు, వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

రావికమతంలో..

సత్యసాయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారిణి సుజాత సత్య సాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అంబేడ్కర్, డీటీ గొర్లె అప్పలనాయుడు, డిప్యూటీ ఎంపీడీఓ సీతారామస్వామి, ఉపసర్పంచ్ గంజి మోదినాయుడు పాల్గొన్నారు.

రోలుగుంటలో..

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సత్యసాయ శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు అలంకరించి మండల ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి, ఎంపీడీఓ నాగేశ్వరరావు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాడుగులలో..

మాడుగుల మోదమాంబ కాలనీలో ఆదివారం స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారి శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 5నుంచి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం స్వామివారి పల్లకి ఊరేగింపు, తిరువీధి ఉత్సవాన్ని జరిపారు.

బుచ్చెయ్యపేటలో..

మండలంలోని సీతయ్యపేట రామాలయంలో సత్యసాయి శత జయంతి ఉత్సవాలు ఘనం గా నిర్వహించారు. ఆదివారం అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షుడు యలమర్తి సతీష్‌బాబు, వాసవీ సంఘం ప్రతినిధులు, యలమర్తి వాసు, అయ్యలు, వెంకన్న, యలమర్తి నరేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

స్థానిక సత్యసాయి జ్ఞాన మందిరంలో సత్యసాయ శత జయంతి ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అన్న సమారాధన ఏర్పా టుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపముఖ్యమంత్రి బూడి.ముత్యాలనాయుడు, జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రోజూ తాగునీరు సరఫరా చేయాలని ఆందోళన

రావికమతం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోటలో ప్రతి రోజూ తాగునీరు సరఫరా చేయాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ గ్రామంలో గర్రెడ్డి, దాసరి, పెద్దబజారు వీధి, వాటర్ ట్యాంకు వీధి తదితర 10 వార్డులకు ప్రతీ రోజూ తాగునీరును సరఫరా చేసేందుకు 2.5 లక్షల లీటర్ల సామర్థ్యం గల రక్షిత నీటి పథకం ఉంది. రెండు నెలల క్రితం జడ్పీ నుంచి నిధులు మంజూరు కావడంతో ట్యాంకు మరమ్మతు పనులు చేపట్టారు. అప్పటి నుంచి రోజు తప్పించి రోజు తాగునీరు ఇస్తున్నందున నానా ఇబ్బందులు పడుతున్నామని అడ్డూరి లక్ష్మి కాసులమ్మ, బత్తుల ఉమ, దుద్దుపూడి ఉమ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రెండు రోజుల నుంచి పూర్తిగా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, దీంతో మంచి నీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోయారు. గ్రామంలో ఉన్న బోర్లు అన్ని ఉప్పు నీరు కావడంతో తాగునీటి కోసం గ్రామం బయటకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పంచాయతీ ఈవో జ్యోతిరెడ్డిని కోరగా.. ట్యాంకు పునరుద్ధరణ పనులు జరుగుతున్నందున పూర్తి స్థాయిలో సరఫరా చేయలేకపోతున్నామని తెలిపారు.

చీడికాడ అభివృద్ధికి ప్రత్యేక కృషి : ఎమ్మెల్యే బండారు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

చీడికాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన చీడికాడ మండల అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇక్కడ జరిగిన ప్రత్యేక జాబ్‌మేళాలో ఆయన మాట్లాడుతూ, చీడికాడ మండలంలో విద్య, వైద్యం, ఉద్యోగాల కల్పనకు పెద్దపీట వేస్తానన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.అప్పారావు మాట్లాడుతూ ఉద్యోగ మేళాలో చీడికాడ మండలంలోని నిరుద్యోగులకు 500 ఉద్యోగాలు ఇచ్చేందుకు 16 కంపెనీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ జాబ్‌మేళాలో 389 మంది యువతీ యువకులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా 153 మందికి వివిధ కంపెనీల ద్వారా ఉద్యోగాలు ఇచ్చామన్నారు. వచ్చే ఏడాది మార్చి నెలలో రెండో దఫా కూడా చీడికాడలోనే ఉద్యోగ మేళ నిర్వహిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతల చిన్నంనాయుడు, పంచాడ దాలెంనాయుడు, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, సహకార సంఘాల చైర్‌పర్సన్లు గవిరెడ్డి జగన్నాథం, బొబ్బాది తాతారావు, కోనాం జలాశయం మాజీ చైర్మన్ గండి ముసలినాయుడు, గవిరెడ్డి శ్రీనివాసరావు, గాలి బాలకృష్ణ పాల్గొన్నారు.

'గోవాడ షుగర్స్' భవితవ్యంపై త్వరలో అఖిలపక్షం

జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు

చోడవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):గోవాడ షుగర్ ఫ్యాక్టరీ భవితవ్యంపై త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్టు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహి ంచిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్యాక్టరీ మనుగడ కోసం అవసరమైన చర్యలు చేపట్టేందుకు త్వరలో అన్నిపక్షాల నాయకులు, రైతులు, మేధావులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి, ఫ్యాక్టరీ నడపడానికి అవసరమైన చర్యలు చేపట్టేలా ప్రభుత్వానికి పార్టీ తరఫున నివేదిక ఇవ్వనున్నామని స్పష్టంచేశారు. బీఎన్ రోడ్డు సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. చాకిపల్లి వద్ద పెద్దేరు నదిని దాటేందుకు వంతెన నిర్మాణంతో పాటు, భోగాపురం వద్ద వరద గట్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకుని వెళ్లాలని నేతలు తీర్మానించారు. చోడవరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నందున, తరచూ ముంపునకు గురవుతున్న ప్రాంతాలలో నివారణ పనులు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖకు ప్రతిపాదనలు పంపించాలని నిర్ణయించినట్టు తెలిపారు. రావికమతం, రోలుగుంట మండలంలో అక్రమ మైనింగ్‌దారులపై సమగ్రంగా విచారణ జరపాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కోరనున్నామన్నారు. నియోజకవరంలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం రికార్డు స్థాయిలో చేసేందుకు శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో మాట్లాడిన నేతలు, కూటమి పాలనలో పార్టీ నేతలకు తగినంత గుర్తింపు లభించేలా చేయడంతో పాటు, సమన్వయం పెంచాలని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కోరుతూ తీర్మానించాలని కోరారు. సమావేశంలో జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు, నాయకులు బలిజ మహరాజు, మైచర్ల నాయుడు, దాడి సూర్యనాగేశ్వరరావు, కర్రి రమేష్, నందారపు రమాదేవి, సరోజిని, కొల్లిమిల్లి వెంకట రమణ, శనివాడ నాయుడుబాబు, కర్రి తమ్మునాయుడు,అడపా నర్సింహమూర్తి, మరిసా రమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జనసేన ఇన్‌చార్జి రాజు

కమ్మేసిన పొగమంచు


మాకవరపాలెంలో ఉదయం 8 గంటల సమయంలో దట్టంగా పొగమంచు

మాకవరపాలెం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం మండలంలో ఆదివారం ఉదయం దట్టంగా పొగమంచు కురిసింది. ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు వీడలేదు. వాహనాలు లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించాల్సి వచ్చింది. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు మంచు వలన కాస్త ఇబ్బంది పడ్డారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి సాయం


జనసేన కార్యకర్త కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

గొలుగొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలుగొండ గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త పాసింబిల్లి చిరంజీవి ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును ఆదివారం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు మంగళగిరిలో అందజేశారు. చిరంజీవి భార్య దుర్గాభవానికి నర్సీపట్నం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్ర ఆధ్వర్యంలో అందించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సలాదుల ప్రసాద్, దేవి, తదితరులు పాల్గొన్నారు.